

పరిశోధన.. బోధనలో ఓ భాగం
పరిశోధన బోధనలో భాగమని మహాత్మా గాంధీ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. - 8లో



కల్వర్టును ఢీకొట్టి..
కొమరబండ వై జంక్షన్ సమీపంలో కల్వర్టును ఢీకొట్టిన కారులో మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. - 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 590 అడుగులు		
ప్రస్తుత నీటి మట్టం	:	570.50 అడుగులు
ఇన్‌ఫ్లో	:	74,474 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	:	4,835 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా : నిల్		
కుడికాల్వ ద్వారా	:	నిల్
ఎడమకాల్వ ద్వారా	:	3,035 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	:	1,800 క్యూసెక్కులు
వరద కాల్వకు	:	నిల్

న్యూస్‌రీల్

మధ్యవర్తిత్వంతో సమస్యలు పరిష్కరించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద

చివ్వెంల(సూర్యాపేట) : చిన్న చిన్న ఘర్షణలకు కోర్టు మెట్లు ఎక్కకుండా మధ్యవర్తిత్వం ద్వారా సమస్యలు పరిష్కరించుకోవచ్చునని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి. లక్ష్మీ శారద సూచించారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కోర్టు ప్రాంగణంలో 90రోజుల ప్రచారం-దేశం కోసం మధ్యవర్తిత్వం అనే అంశంపై న్యాయవాదులకు నిర్వహించిన అవగాహన సమావేశంలో మాట్లాడారు. కోర్టుకు వెళ్లకుండా మధ్యవర్తిత్వం ద్వారా సమస్యను పరిష్కరించుకుంటే ఇరువర్గాలకు సమయం, ధనం వృథాకాకుండా ఉంటుందన్నారు. మధ్యవర్తిత్వం ద్వారా వినియోగదారుల వివాదాలు, డబ్బు, ఆస్తి, సమాజ సంఘర్షణలు, వాణిజ్య, వైవాహిక, వినియోగదారుల వివాదాలు పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి ఫర్హీన్ కౌసర్, జూనియర్ సివిల్ జడ్జి గోపు రజిత, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలి



కుడకుడలోని గంగ దేవమ్మ గుడి వద్ద మొక్క నాటుతున్న అదనపు కలెక్టర్ రాంబాబు

సూర్యాపేట : ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్క నాటాలని అదనపు కలెక్టర్ పర్స రాంబాబు సూచించారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మంగళవారం సూర్యాపేట పట్టణ పరిధిలోని కుడ కుడలో గంగదేవమ్మ గుడి ప్రాంతంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సీహెచ్.హనుమంతరెడ్డి, మున్సిపల్ డీఈ సత్యారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, మున్సిపల్ సిబ్బంది యాదగిరి, వార్డ్ అధికారి రమేష్ వసుంధర, వసీం పాల్గొన్నారు.

25న ఉద్యోగమేళా

భానుపురి (సూర్యాపేట) : ఇంటర్ విద్యార్థులకు కలెక్టర్, హెచ్‌సీఎల్ టెక్‌బీ ఆధ్వర్యంలో ఈనెల 25వ తేదీన సూర్యాపేట పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాల కోసం హెచ్‌సీఎల్ ప్రతినిధి ఫోన్ నంబర్లు 8341405102, 7981834205, 9063564875లను సంప్రదించాలని సూచించారు.

ఎస్సారెస్పీ నీటిని విడుదల చేయాలి



మాట్లాడుతున్న సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి డేవిడ్ కుమార్

తిరుమలగిరి (తుంగతుర్తి): ఎస్సారెస్పీ నీటిని విడుదల చేసి చెరువులు, కుంటలు నింపాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మందారి డేవిడ్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం తిరుమలగిరి మండల కేంద్రంలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర మహాసభ అధ్యక్షుడు కొత్తగట్టు మల్లయ్య, సీపీఐ జిల్లా నాయకుడు ఎల్లంల యాదగిరిలతో కలిసి డేవిడ్‌కుమార్ మాట్లాడారు. ఎస్సారెస్పీ రెండో దశ కింద సూర్యాపేట జిల్లాలో 2 లక్షల ఎకరాలకు పైగా నీళ్లు ఇవ్వాలన్నారు. రుద్రమ చెరువును రిజర్వాయర్ గా చేయాలని డిమాండ్ చేశారు. కాలువలకు మరమ్మతులు చేపట్టి చెరువులు, కుంటలు నింపాలన్నారు. రైతులు నార్లు పోసుకొని నాటు పెట్టడానికి సిద్ధంగా ఉన్న సమయంలో వర్షాలు రాక ఇబ్బందులు పడుతున్నారని ఇలాంటి తరుణంలో ఎస్సారెస్పీ కాల్వల ద్వారా నీటిని విడుదల ఆదుకోవాలని కోరారు. సమావేశంలో బొడ్డు శంకర్, కందుకూరి ప్రవీణ్, పోలేబోయిన కిరణ్, కె.సోమేష్, బచ్చు విజయ్, సుధాకర్ పాల్గొన్నారు.

ఇంకుడు గుంత.. ఇంతే.!

లక్ష్యం చేరని ఇంకుడు గుంతల నిర్మాణం

- స్వచ్ఛభారత్ కింద పైలట్ ప్రాజెక్టుగా మండలానికి ఒక గ్రామం చొప్పున ఎంపిక
- 1,041 ఇంకుడు గుంతలు మంజూరు
- 20వ తేదీతో ముగిసిన డెడ్‌లైన్
- ఇప్పటి వరకు 58.40శాతమే పూర్తి



ఆత్మకూర్ (ఎస్): ఇళ్లలో వాడుకున్న నీటితోపాటు వాననీరు బయటికి వృథాగా పోకుండా భూమిలోకి ఇంకి భూగర్భ జలాలు పెరిగేలా చేపట్టిన ఇంకుడు గుంతల నిర్మాణ లక్ష్యం నెరవేరలేదు. జూలై 20వరకు యుద్ధప్రాతిపదికన ఇంకుడు గుంతల నిర్మాణ పనులు పూర్తి చేయాలని కలెక్టర్ నెలరోజుల క్రితం డెడ్‌లైన్ విధించినా ప్రక్రియ పూర్తికానేలేదు. ఇప్పటి వరకు 58.40శాతం మాత్రమే పూర్తయ్యాయి.

23 గ్రామాల్లో నాలుగు విభాగాల్లో..

భూగర్భ జలాలు పెంచడమే లక్ష్యంగా అధికారులు ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా 23 మండలాల్లో మండలానికి ఒక గ్రామం చొప్పున అధికారులు పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. ఆయా గ్రామాల్లో నాలుగు విభాగాల్లో 1,041 ఇంకుడు గుంతల నిర్మాణానికి కలెక్టర్ అనుమతులు ఇచ్చారు. ఇందులో మొదటి విభాగం కింద ఇళ్లలో వ్యక్తిగతంగా 925, రెండో విభాగం కింద గ్రామ కూడళ్లు, పాఠశాలలు, గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద కమ్యూనిటీ ఇంకుడు గుంతలు 64, మూడో విభాగం కింద మురుగు కాలువలు ముగిసే ప్రాంతాల్లో (డ్రెయిన్ ఎండ్) 10, నాలుగో విభాగం కింద బోరుబావుల రీచార్జ్ కోసం గ్రామ పంచాయతీ, ప్రైవేటు బోర్ల వద్ద 42 ఇంకుడు గుంతలు మంజూరయ్యాయి.

సబ్సిడీ.. దేనికెంత..

ఇంకుడు గుంతల నిర్మాణాలకు ప్రభుత్వం సబ్సిడీ కూడా ప్రకటించింది. వీటిలో వ్యక్తిగత గుంతలకు ఒక్కోదానికి రూ.6వేలు, కమ్యూనిటీ వాటికి రూ.13వేలు, బోర్ వెల్ రీచార్జ్ గుంతలకు రూ.40వేలు, డ్రెయిన్ ఎండ్‌లో నిర్మించేవాటికి రూ.92వేల చొప్పున ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వనుంది. వీటితో పాటు ప్రతి గ్రామానికి కలెక్టర్ ప్రత్యేకంగా రూ.2లక్షల చొప్పున మంజూరు చేశారు.

608 ఇంకుడు గుంతలు పూర్తి

జిల్లాకు అన్ని రకాల ఇంకుడుగుంతలు కలిపి జిల్లాకు 1,041 మంజూరయ్యాయి. కాగా వీటిని ఈనెల 20తేదీ వరకు పూర్తి చేయాలని ఎంపీడీఓల సమావేశంలో కలెక్టర్ గడువు విధించారు. కానీ ఈప్రక్రియ నత్తనడకన నడుస్తోంది. నిర్దేశించిన గడువులోగా కేవలం 608 ఇంకుడుగుంతలు మాత్రమే పూర్తయ్యాయి. ఇంకా 433 ఇంకుడు గుంతల పూర్తికావాల్సి ఉంది.

ప్రయోజనాలు..

- ఇంకుడు గుంతల నిర్మాణంతో గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుపడడంతో పాటు మురుగునీటి సమస్య పరిష్కారం అవుతుంది.
- డ్రెయినేజీలలో నీరు నిల్వ ఉండదు. కాబట్టి దోమలు రావు.
- వర్షపు నీరు, ఇళ్లలో నీరు భూమిలోకి ఇంకి భూగర్భ జలాలు పెరుగుతాయి.

ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలి



ఇంకుడు గుంతల నిర్మాణంతో భూగర్భ జలాలు పెరుగుతాయి. కలెక్టర్ ఆదేశాల మేరకు పాత సూర్యాపేట గ్రామంలో ఇంకుడు గుంతల నిర్మాణం చేపడుతున్నాం. ఇంటింటికి ఇంకుడు గుంతలు నిర్మించుకొని భూగర్భ జలాల పెంపునకు కృషిచేయాలి.
– ఎం.డి.హాసిం, ఎంపీడీఓ, ఆత్మకూర్(ఎస్)

ఇంకుడు గుంతల వివరాలు ఇలా..

మండలం	గ్రామం	మంజూరైనవి	పూర్తయినవి	ప్రారంభించాల్సినవి
అనంతగిరి	గోండ్రియాల	21	08	13
ఆత్మకూర్(ఎస్)	పాతసూర్యాపేట	52	41	11
చిలుకూరు	చిలుకూరు	54	51	03
చింతలపాలెం	గుడిమల్కాపురం	14	14	00
చివ్వెంల	సూర్యానాయక్‌తండా	48	33	15
గరిడేపల్లి	గరిడేపల్లి	47	16	31
హుజూర్‌నగర్	లింగగిరి	29	10	19
జాజిరెడ్డిగూడెం	కాసర్లపహాడ్	21	15	06
కోదాడ	తొగర్రాయి	22	14	00
మద్దిరాల	రెడ్డిగూడెం	90	47	43
మఠంపల్లి	బిల్యానాయక్‌తండా	50	21	29
మేళ్లచెరువు	కందిబండ	45	23	22
మోతె	హుస్సేనాబాద	50	31	19
మునగాల	వెంకట్రాంపురం	49	48	01
నడిగూడెం	నడిగూడెం	30	16	14
నాగారం	పస్తాల	23	19	04
నేరేడుచర్ల	కల్లూరు	40	14	26
నూతనకల్	యడవెల్లి	54	51	03
పాలకవీడు	గుడుగుంట్లపాలెం	31	16	15
పెన్‌పహాడ్	అనంతారం	70	32	38
సూర్యాపేట	టేకుమట్ల	60	33	27
తిరుమలగిరి	రాఘవపురం	69	18	51
తుంగతుర్తి	వెంపటి	58	29	29
మొత్తం		1,041	608	433

సాగర్‌కు పెరిగిన వరద



నాగార్జునసాగర్ : కృష్ణా పరీవాహక ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో సాగర్ జలాశయానికి వరద పెరిగింది. ఎగువన ఉన్న జలాశయాలు పూర్తిస్థాయిలో నిండడంతో అదనంగా వచ్చే నీటినంతా దిగువకు విడుదల చేస్తున్నాయి. శ్రీశైలం జలాశయ నీటిమట్టం గరిష్టస్థాయికి చేరువలో ఉండడంతో ఒక క్రస్ట్‌గేటు ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. కుడి, ఎడమ విద్యుదుత్పాదనతో కలిసి శ్రీశైలం నుంచి సాగర్‌కు 94,755 క్యూసెక్కుల నీరు వస్తోంది. దీంతో సాగర్ నీటిమట్టం 570.20 అడుగుల (257.0774 టీఎంసీలు)కు చేరుకుంది. గడిచిన 24 గంటల్లో సాగర్ జలాశయం నుంచి ఎడమ 2,608 క్యూసెక్కులు, విద్యుతుత్పాదనకు 2,627 క్యూసెక్కులు, ఏఎమ్మార్పీకి 1800 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

దళితులపై పెరుగుతున్న దౌర్జన్యాలు

- దళిత్ శోషణ్ ముక్తి మంచ్ జాతీయ కార్యదర్శి బీవీ రాఘవులు
- సూర్యాపేటలో కేవీపీఎస్ రాష్ట్రస్థాయి సామాజిక శిక్షణ తరగతులు ప్రారంభం



మాట్లాడుతున్న బీవీ రాఘవులు

సూర్యాపేట అర్బన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న మనువాద విధానాలతో దేశంలో దళితులపై దౌర్జన్యాలు పెరిగిపోతున్నాయని దళిత్ శోషణ్ ముక్తి మంచ్ (డీఎస్ఎంఎం) జాతీయ కార్యదర్శి బీవీ రాఘవులు ఆరోపించారు. మంగళవారం సూర్యాపేటలో కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్రస్థాయి సామాజిక శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జెండాను సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తప్పెట్ల స్కైలాబ్ బాబు ఆవిష్కరించారు. అనంతరం బీవీ రాఘవులు మాట్లాడుతూ.. దక్షిణాది రాష్ట్రాల కంటే రెట్టింపు స్థాయిలో ఉత్తరాది రాష్ట్రాల్లో దళితులపై దౌర్జన్యాలు పెట్రేగిపోతున్నాయని అన్నారు. అంబేద్కర్ రాసిన భారత రాజ్యాంగాన్ని అంగీకరించని మనువాద పాలకులు దేశాన్ని ఏలుతున్నారన్నారు. మనువాద ధర్మం, సనాతన ధర్మం ఎడమ చేయి, కుడి చేయి లాంటిదన్నారు. భూమి, రిజర్వేషన్లు, ప్రకృతి వనరులు అట్టడుగు వర్గాలకు దక్కకుండా కేవలం కుల సమస్య విడిగా పరిష్కారం కాదన్నారు. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు కల్పించకుండా సామాజిక న్యాయం సాధ్యం కాదని, అట్టడుగు వర్గాలకు జనాభా దామాషా ప్రకారం కేటాయింపులు లేవని అన్నారు. అన్ని రకాల వివక్షలను అంతమొందించడానికి సమాజంలో దోపిడీని ఎదిరించే శక్తులతో కలిసి సామాజిక న్యాయం కోసం ఉద్యమం చేపట్టాలని పిలుపునిచ్చారు. బిహార్ రాష్ట్రంలో మైనార్టీల ఓట్ల తొలగింపు పౌర ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎండీ అబ్బాస్, తెలంగాణ రైతు సంఘం సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు మల్లు నాగార్జునరెడ్డి, నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, ములకలపల్లి రాములు, మట్టిపల్లి సైదులు, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ చెరుకు ఏకలక్ష్మి పాల్గొన్నారు.

హాస్టళ్లలో కమిటీలు ఏర్పాటు చేయాలి

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, చిత్రంలో అధికారులు

భానుపురి (సూర్యాపేట) : సంక్షేమ వసతి గృహాల్లో ఫుడ్ సేఫ్టీ, ఆహార నాణ్యత, శానిటేషన్‌పై కమిటీలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ సూచించారు. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, సీఎస్ రామకృష్ణారావు, ఇతర కార్యదర్శులతో కలిసి నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో సూర్యాపేట కలెక్టరేట్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లా అధికారులు నెలకోసారి హాస్టళ్లలో నిద్రించి విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలన్నారు. హాస్టళ్లలో ప్రతి విద్యార్థి హెల్త్ ప్రొఫైల్ తయారు చేయాలని సూచించారు. హాస్టల్ ఆవరణలోకి పాములు రాకుండా గడ్డిని శుభ్రం చేయాలన్నారు. లైసెన్స్ సర్వేయర్లు, గ్రామ పాలనాధికారులకు ఈనెల 27న నిర్వహించే పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేయాలని కోరారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి పనులు వేగవంతం చేయాలన్నారు. వీటి నిర్మాణానికి ఇసుక ఉచితంగా ఇవ్వాలన్నారు. లబ్ధిదారుల అకౌంట్, ఆధార్‌లలో ఏమైనా తప్పులు ఉంటే వెంటనే సరి చేసి వారికి నగదు జమ చేయాలన్నారు. వనమహోత్సవంలో శాఖల వారీగా మొక్కలు నాటాలని, పాఠశాలలు, దేవాలయాలు, సంక్షేమ హాస్టళ్లను గుర్తించి గుంతలు తీయాలన్నారు. పౌర సరఫరాల శాఖ అధికారులు ప్రతి మిల్లును తనిఖీ చేసి సీఎంఆర్‌ను వేగవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో డీఎఫ్ఓ సతీష్ కుమార్, డీఈఓ అశోక్, డీఎంహెచ్ఓ చంద్రశేఖర్, హౌసింగ్ పీడీ సిద్ధార్థ, పరిశ్రమలశాఖ జిల్లా అధికారి సీతారాంనాయక్, డీఎస్ఓ మోహన్ బాబు, సంక్షేమ అధికారులు శంకర్, శ్రీనివాస్‌నాయక్, జగదీశ్వర్ రెడ్డి, లత, డీసీఓలు, ఆర్‌సీఓలు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం

భానుపురి (సూర్యాపేట) : లింగ నిర్ధారణ చేయడం చట్టరీత్యా నేరమని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ పేర్కొన్నారు. మంగళవారం సూర్యాపేట కలెక్టర్ చాంబర్‌లో నిర్వహించిన డిస్ట్రిక్ట్ రిజిస్ట్రేషన్ అథారిటీ కమిటీ సమావేశంలో జిల్లా జడ్జి లక్ష్మీ శారద, అదనపు కలెక్టర్ పి. రాంబాబుతో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. పీసీపీఎన్‌డీటీ చట్టం, క్లినికల్ ఎస్టాబ్లిష్ మెంట్ యాక్ట్‌ల ప్రకారం అర్హత లేని వారు హాస్పిటల్స్, డయాగ్నొస్టిక్ సెంటర్లు నిర్వహించకూడదని ఆదేశించారు. అర్హత లేని వారు నిర్వహిస్తే ఆ సెంటర్ అనుమతి రద్దు చేయాలన్నారు. జిల్లాలో 44 స్కానింగ్ సెంటర్లు పని చేస్తున్నాయని, అర్హత లేకుండా నిర్వహిస్తున్న మూడు సెంటర్‌లను సీజ్ చేసినట్లు తెలిపారు. వారిని చట్టం ప్రకారం కోర్టుకు అప్పగించాలని ఆదేశాలిచ్చారు. జిల్లా జడ్జి లక్ష్మీ శారద మాట్లాడుతూ గర్భస్రావం చేస్తున్న హాస్పిటళ్లను, లింగ నిర్ధారణ చేస్తున్నా స్కానింగ్ సెంటర్లను అధికారులు గుర్తించి వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, డీఎంహెచ్ఓ పి.చంద్రశేఖర్, డిప్యూటీ డీఎంహెచ్ఓ చంద్రశేఖర్, నాజియా, ఆనంద్, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లాలి

- ఏఐసీసీ సెక్రటరీ సంపత్‌కుమార్



మాట్లాడుతున్న ఏఐసీసీ సెక్రటరీ సంపత్‌కుమార్

సూర్యాపేట : కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పార్టీ కార్యకర్తలు క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లాలని ఏఐసీసీ సెక్రటరీ సంపత్ కుమార్ సూచించారు. మంగళవారం సూర్యాపేట పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పార్టీ సంస్థాగత పునర్నిర్మాణ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై స్థానిక ఎన్నికల్లో ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు అంజద్‌అలీ, చకిలం రాజేశ్వరరావు, కోతి గోపాల్ రెడ్డి, సురేష్ రావు, వీరన్న నాయక్, కక్కిరేణి శ్రీనివాస్, వేముల కొండ పద్మ, చింతమల్ల రమేష్,తిరుమల ప్రగడ అనురాధ కిషన్ రావు, గుడిపాటి నరసయ్య, ఎలిమినేటి అభినయ్, తండు శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాలికను వేధించిన యువకుడికి జైలుశిక్ష

చివ్వెంల(సూర్యాపేట): లైంగిక వాంఛ తీర్చాలని బాలికను వేధించిన యువకుడికి 18 నెలల జైలుశిక్ష విధిస్తూ సూర్యాపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి. లక్ష్మీశారద మంగళవారం తీర్పు వెలువరించారు. వివరాలు.. గరిడేపల్లి మండల సర్వారం గ్రామానికి బాలికను అదే గ్రామానికి చెందిన కొమ్ము నాగరాజు అలియాస్ దానియేలు 2020 అక్టోబర్ 2వ తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో వెళ్లి లైంగిక వాంఛ తీర్చాలని వేధించాడు. దీంతో బాలిక ఒక్కసారిగా కేకలు వేయడంతో దానియేలు అక్కడ నుంచి పరారయ్యాడు. సాయంత్రం ఇంటికి వచ్చిన తల్లిదండ్రులకు బాలిక జరిగిన విషయం చెప్పడంతో.. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో అప్పటి ఎస్ఐ వెంకన్న కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. పలువురు సాక్షులను విచారించిన ప్రధాన న్యాయమూర్తి.. పబ్లిక్ ప్రాసిక్యూటర్ కొంపల్లి లింగయ్య వాదనలతో ఏకీభవిస్తూ నిందితుడికి 18 నెలల జైలుశిక్షతో పాటు రూ.5,500 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. పీపీకి లైజన్ ఆఫీసర్ గంపల శ్రీకాంత్, కోర్టు కానిస్టేబుల్ సైదులు సహకరించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

● మరో వ్యక్తికి గాయాలు

చివ్వెంల(సూర్యాపేట): అతివేగంగా వస్తున్న కారు అదుపుతప్పి ఆటోను ఢీకొట్టడంతో వృద్ధుడు మృతిచెందాడు. మరో వ్యక్తికి గాయలయ్యాయి. ఈ ఘటన హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై చివ్వెంల మండలం గుంజలూరు గ్రామ స్టేజీ వద్ద మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట పట్టణంలోని ముత్యాలమ్మ బజార్‌కు చెందిన అనిల్, నూకల సత్యనారాయణ(65) గ్రామాల్లో పాత ఇనుప సామాను కొనుగోలు చేసేందుకు ట్రాలీ ఆటోలో బయల్దేరారు. ఈ క్రమంలో చివ్వెంల మండలం గుంజలూరు గ్రామంలో పాత ఇనుప సామాను కొనుగోలు చేసి తిరిగి సూర్యాపేటకు వస్తుండగా.. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై గుంజలూరు గ్రామ స్టేజీ వద్ద విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు వెనుక నుంచి ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో వెనుకన కూర్చున్న సత్యనారాయణకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. అనిల్ కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఘటనా స్థలంలో ప్రమాదానికి గురైన వాహనాలను రోడ్డు పక్కకు తీయించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కన కరత్నం కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట జనరల్ హాస్పిటల్‌కు తరలించారు.

పరిశోధన.. బోధనలో ఓ భాగం

● ఎంజీయూ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్
● ఘనంగా ఎన్జీ కాలేజీ వ్యవస్థాపక వేడుకలు
● విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ అందజేత


ఎన్జీ కళాశాల వ్యవస్థాపక వేడుకల్లో మాట్లాడుతున్న ఎంజీయూ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్

రామగిరి(నల్లగొండ): పరిశోధన బోధనలో భాగమని మహాత్మాగాంధీ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. నల్లగొండ పట్టణంలోని ఎన్జీ కాలేజీ(నాగార్జున ప్రభుత్వ కళాశాల) స్థాపించి 69 సంవత్సరాలు పూర్తి చేసుకుని 70వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా మంగళవారం కాలేజీలో వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వీసీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అధ్యాపకులు బోధనకు పరిమితం కాకుండా పరిశోధనలో నిమగ్నం కావాలని తద్వారా సబంధిత సబ్జెక్టుపై అవగాహన పెరుగుతుందన్నారు. స్వయం ప్రతిపత్తి కళాశాలలు పరిశోధనకు పెద్దపీట వేయాలని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా విద్యార్థుల హాజరుశాతం కేవలం 50 శాతమే ఉంటుందని, కనీసం 75 శాతం హాజరుశాతం ఉన్న విద్యార్థులకే ఉపకార వేతనం, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలని తెలంగాణ కళాశాల విద్య ఉన్నతాధికారులకు సూచించారు. ప్రతి అధ్యాపకుడు విధిగా హాజరు తీసుకోవాలని అన్నారు. రేమీడియల్ క్లాసులు తీసుకొని అధ్యాపకులు విద్యార్థులకు మెంటార్‌గా ఉండాలన్నారు. ఇతర అతిథులు మాట్లాడుతూ.. కళాశాలలో చదువుకున్న విద్యార్థులు దేశ విదేశాల్లో ఉన్నత స్థానాల్లో ఉండడం కళాశాలకు గర్వకారణమని అన్నారు. 70 ఏళ్ల ప్రస్థానంలో ఎంతోమంది విద్యార్థులకు ఉన్నతులుగా తీర్చిదిద్దిన కళాశాలకు తమవంతు సహాయ సహకారాలు అందించాలని పూర్వ విద్యార్థులను కోరారు. ఎన్జీ కళాశాలకు రానున్న కాలంలో న్యాక్-ఎ గ్రేడ్ రావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ కళాశాల విద్య ఆర్‌జేడీ డాక్టర్ డీఎస్ఆర్. రాజేంద్రసింగ్ మాట్లాడుతూ.. విద్యార్థులు అన్ని ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలని అన్నారు. ప్రతి ఉద్యోగ ప్రకటనను గమనిస్తూ వాటికి సిద్ధం కావాలని సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్ మాట్లాడుతూ.. ఇక నుంచి ప్రతి ఏటా టాపర్‌గా నిలిచిన విద్యార్థులకు బంగారు పతకాలు అందజేస్తామన్నారు. ఔత్సాహికులు ముందుకు వచ్చి కళాశాల పేరు మీద రూ.1.5లక్షలు డిపాజిట్ చేస్తే వారి పేరు మీద లేదా వారు సూచించిన వారి పేరు మీద బంగారు పతకాలు ఇస్తామని తెలిపారు. అనంతరం 2021–2022 నుంచి 2023–24 వరకు వివిధ సబ్జెక్టులలో టాపర్‌గా నిలిచిన యూజీ, పీజీ విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంజీయూ సీఓఈ డాక్టర్ జి. ఉపేందర్‌రెడ్డి, తెలంగాణ కళాశాల విద్య రిటైర్డ్ ఆర్‌జేడీ డాక్టర్ జి. యాదగిరి, ఉమెన్స్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరాజు, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు డాక్టర్ రాజారామ్, ఎన్జీ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణప్రసాద్, రిటైర్డ్ అధ్యాపకులు డాక్టర్ లింగయ్య, డాక్టర్ లక్ష్మయ్య, మీనయ్య, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ వరంగి రవికుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అంతటి శ్రీనివాస్, సీఓఈ బత్తిని నాగరాజు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ వైవీఆర్. ప్రసన్నకుమార్, తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ వెల్దండి శ్రీధర్, అధ్యాపకులు డాక్టర్ మునిస్వామి, డాక్టర్ ఎ. మల్లేశం, సీహెచ్. సుధాకర్, ఎన్. కోటయ్య, శిరీష, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


హాజరైన విద్యార్థులు, అధ్యాపకులు


రూ.1.50లక్షల చెక్కు అందజేస్తున్న తెలంగాణ కళాశాల విద్య రిటైర్డ్ ఆర్‌జేడీ జి. యాదగిరి

అత్యాధునిక సైన్స్ ల్యాబ్‌లు


ఎన్జీ కాలేజీలో అత్యాధునిక సదుపాయాలతో సైన్స్ ల్యాబ్‌లున్నాయి. 2024లో పీజీ జువాలజీ కోర్సు పూర్తి చేశాను. రెండు సంవత్సరాలు కలిపి 90 శాతం సాధించి టాపర్‌గా నిలిచాను. కాలేజీలోని అతిపెద్ద ల్యాబ్, గ్రంథాలయం విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడ్డాయి.
– వేదం గాయత్రి, ఎంఎస్సీ జువాలజీ

బోధనా తీరు భేష్


మాది తిప్పర్తి మండలం మామిడాల గ్రామం. ఎన్జీ కాలేజీలో 2020 నుంచి 2023 వరకు డిగ్రీ ఎంపీసీఎస్ చదువుకున్నాను. కళాశాలలో అధ్యాపకుల బోధన చాలా బాగుంది. అన్ని సబ్జెక్టుల అధ్యాపకులు నాణ్యమైన బోధన అందించారు. ఫిజిక్స్, మాథ్స్, కంప్యూటర్ సైన్స్ సబ్జెక్టుల్లో టాపర్‌గా రావడంతో పాటు ఫిజికల్ సైన్స్ కోర్సులో ఓవరాల్ టాపర్‌గా నిలిచా.
– జంతిక చిట్టిబాబు, ఎంపీసీఎస్

గర్వంగా ఉంది


ఎన్జీ కాలేజీలో చదువుకోవడం గౌరవంగా భావిస్తున్నాను. 2022 నుంచి 2024లో డిగ్రీ ఈహెచ్‌పీ గ్రూప్ చదివాను. అన్ని సబ్జెక్టుల్లో టాపర్ నిలిచి గోల్డ్ మెడల్ సాధించడం గర్వంగా ఉంది. ఎన్జీ కాలేజీలో చదువుకోవాలనేది చాలా మంది విద్యార్థుల కోరిక. ఎంతో మందికి ఈ కళాశాల విద్యనందించింది. అనుభవజ్ఞులైన అధ్యాపకులచే బోధన కళాశాల ప్రత్యేకత.
– మసిరా ఫర్హా, ఈహెచ్‌పీ

ఎన్జీ కాలేజీలో చదవాలనే కోరిక నెరవేరింది


ఎన్జీ కాలేజీలో చదవాలని ప్రతిఒక్కరికి ఉంటుంది. నేను డిగ్రీ ఇక్కడ చదవలేకపోయాను. కానీ కాలేజీలో పీజీ ఎకనామిక్స్ పూర్తిచేశాను. రెగ్యులర్ తరగతులు హాజరుకావడం, అధ్యాపకులు చెప్పిన సూచనలు టాపర్‌గా నిలవడానికి సహకరించాయి.
– బొమ్ము వాగ్దేవి, ఎంఏ ఎకనామిక్స్

మేలిమి బంగారాలు


వీసీ చేతులమీదుగా గోల్డ్ మెడల్, సర్టిఫికెట్ అందుకుంటున్న బలికే శ్వేత, బీకాం


వర్రె గౌతమి, పొలిటికల్ సైన్స్


కొన నమిత, బీఎస్సీ లైఫ్ సైన్స్


రాయంచు తేజశ్రీ, ఫిజికల్ సైన్స్


భీమనపల్లి కావ్య, బోటనీ


బరిగెల శ్రవణ్, ఎంఏ తెలుగు


కంచర్ల శివాని, జియాలజీ


జక్కుల రేణుక, మ్యాథ్స్


గాదె నాగలక్ష్మి, ఫిజిక్స్


ఎన్. రోహిణి, కెమిస్ట్రీ


పేర్ల మహేష్, బి.కాం


జక్కల మనిషా, జువాలజీ


సఫియా నాజ్, ఎంఎస్సీ కెమిస్ట్రీ


దాకోజీ గోదాశ్రీ, బోటనీ


రాయగోపి చందన, కెమిస్ట్రీ


పెరిక పల్లవి, ఎంకామ్


ఎం. జ్యోతి, మ్యాథ్స్


లకాని నవ్య, ఫిజిక్స్


బడిక నిష, కెమిస్ట్రీ


బి. శివమణి, బీకాం(అకౌంటెన్సీ)


ఆకోజు సుమ, బీఎస్సీ లైఫ్‌సైన్స్


షేక్ ఇమ్మానుయేల్, కంప్యూటర్ సైన్స్


జి. పూజ, మైక్రోబయాలజీ

భార్య వేధింపులు తాళలేక భర్త ఆత్మహత్య

మర్రిగూడ: భార్య వేధింపులు తాళలేక ఉరేసుకుని భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మర్రిగూడ మండలం కమ్మగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని బోజ్యతండాలో మంగళవారం జరిగింది. స్థానిక ఎస్ఐ ఎం. కృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బోజ్యతండాకు కరంటోతు అనిల్ (30) తన భార్య మంజుల వేధింపులు తాళలేక గ్రామశివారులో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి కమల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం మృతేహాన్ని దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుత్ స్తంభాలను ఢీకొట్టిన కారు

● మూడు గ్రామాలకు నిలిచిపోయిన కరెంట్ సరఫరా

నిడమనూరు: నిడమనూరు మండల కేంద్రం శివారులో సోమవారం అర్ధరాత్రి కారు బీభత్సం సృష్టించింది. అతివేగంగా వచ్చిన కారు నర్సింహులగూడెం వద్ద పంతులు పెంటోజీ పెట్రోల్ బంక్ ఎదుట 167వ నంబర్ జాతీయ రహదారిపై ఉన్న బారికేడ్లతో పాటు 11కేవీ విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొని రోడ్డు పక్కన ఆగిపోయింది. దీంతో శాఖాపురం, నర్సింహులగూడెం, లక్ష్మీపురం గ్రామాల్లో సోమవారం అర్ధరాత్రి, మంగళవారం మొత్తం విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఎయిర్ బ్యాగ్స్ తెరుచుకోవడంతో కారులో ప్రయాణిస్తున్న వారు స్వల్పగాయాలతో బయటపడ్డారు. పెట్రోల్ బంక్‌లోని సీసీ కెమెరాల్లో రికార్డయిన దృశ్యాలను చూస్తే అతివేగం కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోందని స్థానికులు పేర్కొన్నారు. విద్యుత్ స్తంభాలకు మరమ్మతుల కారణంగా నిడమనూరు మండల కేంద్రంలో కూడా విద్యుత్ సరఫరా నిలిపివేశారు. మంగళవారం ఉదయం ఘటనాస్థలం నుంచి కారును పోలీసులు తరలించారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


నంద్యాల ఆదిరెడ్డి (ఫైల్)

వేములపల్లి: బోరు బావి వద్ద విద్యుత్ మోటారు ఆన్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై రైతు మృతిచెందాడు. ఈ ఘటన వేములపల్లి మండలం బుగ్గబావిగూడెం గ్రామంలో మంగళవారం జరిగింది. గ్రామస్తులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. బుగ్గబావిగూడేనికి చెందిన నంద్యాల ఆదిరెడ్డి (58) మంగళవారం మధ్యాహ్నం గ్రామ శివారులోని బోరు బావి వద్దకు వెళ్లి విద్యుత్ మోటారు ఆన్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. సమీపంలోని రైతు నలబోతు వెంకన్న గమనించి దగ్గరుకు వెళ్లి చూడగా ఆదిరెడ్డి పొలంలో విగతజీవిగా పడి ఉన్నాడు. వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని వేములపల్లి పోలీసులు తెలిపారు.

కల్వర్టును ఢీకొని మంటల్లో కారు దగ్ధం


మంటల్లో దగ్ధమవుతున్న కారు

కోదాడరూరల్: కల్వర్టును ఢీకొట్టిన కారులో మంటలు చెలరేగి కారు పూర్తిగా దగ్ధమైంది. కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులు ప్రాణాలతో సురక్షితంగా బయటపడ్డారు. ఈ ఘటన హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై కోదాడ పట్టణ పరిధిలోని కొమరబండ వై జంక్షన్ సమీపంలో మంగళవారం జరిగింది. వివరాలు.. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా రోళ్లపూడికి చెందిన జి. అనిల్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. కంపెనీ పనిమీద మంగళవారం కారులో హైదరాబాద్ నుంచి విజయవాడకు వెళ్తూ.. మార్గమధ్యలో ఇద్దరి ప్రయాణికులను ఎక్కించుకున్నాడు. ఈ క్రమంలో కోదాడ పట్టణ శివారులోని కొమరబండ వై జంక్షన్ వద్దకు రాగానే ముందు వెళ్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో రోడ్డు పక్కన ఉన్న కల్వర్టును కారుతో ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కారులో ఉన్న అనిల్‌తో పాటు మరో ఇద్దరు ప్రయానికులు క్షేమంగా బయటపడ్డారు. అనిల్ కారును వెనక్కి తీస్తున్న సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

నేటి నుంచి అథ్లెటిక్స్ పోటీలు

పెద్దవూర: పెద్దవూర మండలం చలకుర్తి జవహర్ నవోదయ విద్యాలయంలో బుధవారం నుంచి రెండు రోజుల పాటు తెలంగాణ క్లస్టర్ లెవల్ అథ్లెటిక్ మీట్–2025 నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ శంకర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలోని 9 జేఎన్‌వీల నుంచి 57మంది బాలురు, 39 మంది బాలికలు ఈ అథ్లెటిక్స్ మీట్‌లో పాల్గొంటారని తెలిపారు. క్లస్టర్ లెవల్‌లో ఎంపికైన 25మంది బాలురు, 25మంది అమ్మాయిలు ఈ నెల 27వ తేదీన కర్ణాటక రాష్ట్రం గదక్ జిల్లా మందరాగి జవహర్ నవోదయ విద్యాలయంలో జరిగే రీజనల్ మీట్‌లో పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

కారు, మూడు బైక్‌లు ధ్వంసం..


ధ్వంసమైన కారు, బైక్‌లు

భూదాన్‌పోచంపల్లి: మద్యం మత్తులో ఇద్దరు యువకులు అజాగ్రత్తగా కారు నడపడంతో రోడ్డు పక్కన పార్కింగ్ చేసిన బైక్‌ల పైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో కారుతో పాటు మూడు బైక్‌లు పాక్షికంగా ధ్వంసమయ్యాయి. సోమవారం రాత్రి భూదాన్‌పోచంపల్లి మున్సిపాలిటీ కేంద్రంలో ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన ఉడతల లోకేశ్ యాదవ్, పోచంపల్లికి చెందిన సంజీవ సోమవారం రాత్రి పూటుగా మద్యం తాగారు. మద్యం మత్తులో రాత్రి 10.20గంటల సమయంలో కారులో పద్మానగర్ నుంచి పోచంపల్లి వైపు అతివేగంగా వస్తూ పోచంపల్లి మున్సిపాలిటీ కేంద్రంలో మెయిన్ రోడ్డు పక్కన సూరేపల్లి భూషణ్ షాపు ఎదుట పార్కింగ్ చేసిన బైక్‌లను, కరెంట్ స్తంభాన్ని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో మూడు బైక్‌లు, కారు పాక్షికంగా ధ్వంసమయ్యాయి. కారులో ఉన్న ఇద్దరు యువకులు సురక్షితంగా బయటపడ్డారు. ప్రమాదం జరిగిన తర్వాత సదరు యువకులు మద్యం మత్తులో కారులో పాటలు పెట్టుకొని డ్యాన్సులు చేయడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకున్నారు. కారు నడిపిన లోకేష్‌పై చర్యలు తీసుకోవాలని మంగళవారం బాధితుడు సూరెపల్లి భూషణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు.

మద్యం దుకాణాల్లో ఎక్సైజ్ తనిఖీలు


ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌కు తరలించిన అనుమానాస్పద మద్యం సీసాలు

కోదాడరూరల్: మేళ్లచెర్వు మండలం రామాపురంలో కల్తీ మద్యం తయారీ గుట్టురట్టవ్వడంతో కోదాడ ఎక్సైజ్ పోలీసులు మంగళవారం కోదాడ పట్టణంలోని మద్యం దుకాణాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో పట్టణంలోని సూర్యాపేట రోడ్డులో ఉన్న ఎస్ఎస్ మద్యం దుకాణంలో అనుమానాస్పదంగా ఉన్న పలు మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆ మద్యం సీసాలను వరంగల్‌లోని ఎక్సైజ్ శాఖ కెమికల్ ల్యాబ్‌కు పంపించి మద్యంలో కల్తీ జరిగిందా లేదా అనే విషయాలను తెలుసుకుంటామని ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. మద్యంలో కల్తీ జరిగినట్లు నిర్ధారణ జరిగితే ఆ షాపుపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. ఇదిలా ఉంటే కోదాడ మద్యం దుకాణాల్లో కూడా కల్తీ మద్యం విక్రయాలు జరుగుతున్నాయని ప్రచారం జరుగుతోంది. షాపుల వద్ద తాగే వారికి ఈ నకిలీ మద్యం సీసాలను తీసుకొచ్చి విక్రయిస్తున్నారని మందుబాబులు అంటున్నారు. మద్యం దుకాణాలపై ఎక్సైజ్‌శాఖ ఉన్నతాధికారులు తనిఖీలు నిర్వహిస్తే నకిలీ మద్యం అమ్మకాలు బయటకు వస్తాయని చెబుతున్నారు.

వలస కార్మికులను నిర్బంధించిన 8 మందిపై కేసు

● వివరాలు వెల్లడించిన నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్


వెట్టి నుంచి విముక్తి పొందిన వలస కార్మికులతో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్


వలస కార్మికుడి వీపుపై దెబ్బలను చూస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ, చందంపేట: ఇతర రాష్ట్రాలకు చెందిన వలస కార్మికులను నేరెడుగొమ్ము మండలం వైజాగ్ కాలనీ ప్రాంతంలో నిర్బంధించి వెట్టిచాకిరి చేయిస్తున్న 8 మందిపై కేసు నమోదు చేసినట్లు నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్ తెలిపారు. ఈ కేసు వివరాలను మంగళవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఆయన విలేకరులకు వెల్లడించారు. పెద్దఅడిశర్లపల్లి మండలం బాణాలకుంట గ్రామానికి చెందిన వడ్త్య జవహర్‌లాల్, పాయతండాకు చెందిన బాణావత్ రమేష్, ఏపీలోని అనకాపల్లి జిల్లాకు చెందిన మైనంపల్లి శివ, కారె సింహాచలం, వంక విశాఖ అలియాస్ ఇషాక్, నేరెడుగొమ్ము మండలం వైజాగ్ కాలనీకి చెందిన ఏరిపల్లి బావోజీ, తాతారావు, చాపల బంగారి, గుడిపల్లి మండలానికి చెందిన జబ్బార్ అలియాస్ జవహర్‌లాల్, రమేష్, శివ కుమ్మక్కై హైదరాబాద్‌కు చెందిన రాజు, జగన్, విజయవాడకు చెందిన లోకేష్‌ను ఏజెంట్లుగా నియమించుకున్నారు. ఈ ఏజెంట్లు ఒక్కో మనిషికి రూ.1500 చొప్పున కమిషన్ తీసుకుని, హైదరాబాద్, విజయవాడ నుంచి వలస కార్మికులకు రూ.15వేలు జీతం ఇస్తామని, రెండు రెండు గంటలు మాత్రమే పని, భోజనం, వసతి కల్పిస్తామని నమ్మబలికి వారిని దేవరకొండ, మల్లేపల్లి వరకు పంపుతారు. అక్కడి నుంచి వలస కార్మికుల సెల్‌ఫోన్లను నిందితులు తమ ఆధీనంలోకి తీసుకొని రాత్రివేళ బైక్‌లపై నేరెడుగొమ్ము మండలం బాణాలకుంట, వైజాగ్ కాలనీకి తరలించి వారితో చేపలు పట్టడం, వలలు లాగించడం చేయించేవారు. రెండు పూటలు మాత్రమే భోజనం పెట్టి, పనికి తగిన వేతనం ఇవ్వకపోగా.. వేతనం అడిగితే వేడి చేసిన సీకులతో వాతలు పెట్టేవారు. కనీసం కుటుంబ సభ్యులతో కూడా మాట్లాడనివ్వకుండా ఇబ్బందులకు గురిచేసేవారు. ఈ విషయంపై సమాచారం అందుకున్న నేరేడుగొమ్ము పోలీసులు దేవరకొండ ఏఎస్పీ మౌనిక ఆధ్వర్యంలో ఈ నెల 12న స్పెషల్ ఆపరేషన్ చేపట్టి కార్మికులకు విముక్తి కల్పించారు. నిందితులపై నేరడుగొమ్ము పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు చేశారు. ఈ ఘటనకు సంబంధించి 8 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్పీ తెలిపారు. 32 మంది వలస కార్మికులను సురక్షిత ప్రాంతానికి తరలించి వారి వివరాలు సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు. వీరిలో నలుగురు బాలకార్మికులు ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. ఏజెంట్లు అయిన రాజు, జగన్, లోకేష్, వెంకన్నను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. విలేకరుల సమావేశంలో దేవరకొండ ఏఎస్పీ మౌనిక, డిండి, కొండమల్లేపల్లి సీఐలు, గుడిపల్లి, నేరడుగొమ్ము, గుర్రంపోడు ఎస్ఐలు, రెవెన్యూ, చైల్డ్ కేర్, సీడబ్ల్యూసీ బృందం, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళపై దాడి.. ముగ్గురి అరెస్ట్

నూతనకల్: భూ తగాదాలు, పాత కక్షలు దృష్టిలో పెట్టుకొని మహిళపై కత్తితో దాడి చేసిన ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నూతనకల్ మండలం ఎర్రపహాడ్ గ్రామానికి చెందిన లింగాల నానయ్య, లింగాల లింగమూర్తి మధ్య కొంతకాలంగా భూ తగాదాలు జరుగుతున్నాయి. ఇటీవల వ్యవసాయ భూమి వద్దకు వెళ్లిన లింగాల లింగమూర్తి భార్య రేణుకపై పాత కక్షలను దృష్టిలో పెట్టుకొని లింగాల నానయ్య, అతడి భార్య లలిత, కుమారుడు ఏకస్వామి కత్తితో దాడి చేసి గాయపర్చారు. రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మంగళవారం నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శ్రీరాజ్యలక్ష్మిచెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యహోమం, పంచామృతాభిషేకం జరిపించారు. కల్యాణ వేడుకలో భాగంగా విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, మాంగళ్యధారణ గావించారు. స్వామి, అమ్మవార్లను గరుడవాహనంపై ఊరేగించారు. మహానివేదన గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. క్షేత్రపాలకుడైన శ్రీఆంజనేయస్వామికి నాగవల్లి దళాలతో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్ కుమార్, అర్చకులు పాల్గొన్నారు.

